Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL/2024/86143

WANTED
స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి. అనుభవం,అర్హతను భట్టి ప్రాధాన్యత ఇవ్వబడును
సంప్రదించండి సెల్ : 9440815774

Associate Editor: K L KRISHNAM RAJU | Volume: 6 | Issue : 133 | Saturday 26.04.2025 | Price : Rs.3/- | Pages : 4

అసోసియేట్ ఎడిటర్ కే ఎల్ కృష్ణంరాజు | సంపుటి: 6 | సంచిక : 133 | శనివారం 26. 04. 2025 | వెల : రూ.3/- | పేజీలు 4

### ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టుకు...
## రూ. కోటి విరాళం



తిరుమల, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** హైదరాబాద్‌కు చెందిన అపర్ణ ఎంటర్ ప్రైజస్ లిమిటెడ్ (వెటిరో టైల్స్) సంస్థ శుక్రవారం శ్రీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు రూ. కోటి విరాళంగా అంది ంచిం ది. ఈ మేరకు తిరుమలలోని టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బీఆర్ నాయుడుకు ఆ సంస్థ ప్రతినిధి బి.రమేష్ విరాళం డీడీని అందజేశారు.

**మే నెలలో శ్రీ కోదండరామాలయంలో విశేష ఉత్సవాలు**

తిరుపతి శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో మే నెలలో విశేష ఉత్సవాల వివరాలను అధికారులు వెల్లడించారు. మే 3, 10, 17, 24, 31వ తేదీల్లో శనివారం సందర్భంగా ఉదయం 6 గంటలకు శ్రీ సీతారామ లక్ష్మణుల మూలవర్ల అభిషేకం , సాయంత్రం 5 గంటలకు మిగతా 2 లో

### పాకిస్తాన్‌లోని ఆంధ్రులు...
## స్వదేశానికి రావాలి



విజయనగరం, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి ఎవరైనా పాకిస్తాన్‌లో ఉన్నవారు స్వదేశానికి రావడానికి అడ్డంకులు ఉన్నట్లయితే ఎన్నారై విభాగం ద్వారా పరిష్కరిస్తామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. పాకిస్తాన్‌లో ఉన్న ఆంధ్రులు స్వదేశానికి తిరిగి వస్తే వారి నైపుణ్యతను అనుసరించి భరోసా కల్పిస్తామని హామీ ఇచ్చారు. విజయనగరం జిల్లాలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ... నవంబర్ నుంచి స్పాంజ్ పెన్షన్లు ఇస్తున్నామని.. భర్త చనిపో యిన మొదటి నెలలోనే పెన్షన్ ఇస్తున్నామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు. కూటమి ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు 30 వేలమంది వితంతువులకు పెన్షన్ కొత్తగా ఇవ్వడం జరిగిందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. పెండింగ్‌లో మిగతా 2 లో

### అమరావతి అభివృద్ధికి..
# సాయమందించండి

**అమరావతి పునర్ నిర్మాణ పనుల ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీని ఆహ్వానించిన చంద్రబాబు**



అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఈ భేటీ దాదాపు గంటన్నర పాటు సాగింది. ఈ సందర్భంగా ఇటీవల జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్ వద్ద జరిగిన ఉగ్రదాడిని చంద్రబాబు తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదంపై పోరులో కేంద్ర ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సంపూర్ణంగా మద్దతు ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఏపీ రాజధాని అమరావతి పనుల పునఃప్రారంభం సందర్భంగా మే 2వ తేదీన తలపెట్టిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని ప్రధాని మోదీని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో సుమారు లక్ష కోట్ల రూపాయలకు పైగా విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాలని, వాటికి ప్రధాని చేతుల మీదుగా శంకుస్థాపన చేయించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తుండడం తెలిసిందే. ఇందుకు సంబంధించిన రోడ్‌మ్యాప్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సిద్ధం చేసింది. ప్రధానితో చంద్రబాబు భేటీలో అమరావతి అభివృద్ధి, పోలవరం ప్రాజెక్టు పురోగతి, రాష్ట్రానికి సంబంధించిన ఇతర కీలక ప్రాజెక్టులు, ఆర్థిక వనరులు, విభజన హామీలు వంటి పలు అభివృద్ధి అంశాలపై కూడా చర్చించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధే లక్ష్యంగా మిగతా 2 లో

### అమాయకులను చంపడం...
## దుర్మార్గం : మంత్రి



విజయవాడ, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులు అమాయకులైన 26 మంది పర్యాటకులను చంపడం దుర్మార్గమని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ ఇవాళ(శుక్రవారం) జనసేన ఆధ్వర్యంలో విజయవాడలోని పాత బస్టాండ్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల మనోహర్, సామినేని ఉదయభాను, అమ్మిశెట్టి వాసు, మండలి రాజేష్, మిగతా 2 లో

### రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమంగా తాము...
## ప్రజల్లోకి వెళ్తాం...



అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :**
భారత రాజ్యాంగ సంరక్షణ కోసం తమ పార్టీ నేతలు ఉద్యమిస్తున్నా మని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. ఏప్రిల్ 9వ తేదీన అహ్మదాబాద్‌లో కాంగ్రెస్ న్యాయపథ్‌పై నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఏపీలో ఈ న్యాయపథ్ ద్వారా వాస్తవాలను ప్రజలకు వివరిస్తామని అన్నారు. బీజేపీ సొంత రాజ్యాంగం అమలు చేస్తూ ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు. ఏపీసీసీ ఎగ్జిక్యూటివ్ సమావేశం శుక్రవారం విజయవాడలోని కాంగ్రెస్ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో షర్మిల, కాంగ్రెస్ జాతీయ, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు. ఈ సదర్భంగా షర్మిల మీడియాతో మాట్లాడుతూ... అన్నివర్గాల వారికి సమాన న్యాయం చేయాలనేది కాంగ్రెస్ సిద్ధాంతని ఉద్ఘాటించారు. 50 శాతం మిగతా 2 లో

### వడ్ల కొనుగోలులో...
## కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం



హైదరాబాద్, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** వడ్ల కొనుగోలులో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలోని వడ్ల కొనుగోలు కేంద్రాన్ని హరీశ్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట వంటి జిల్లాల్లో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల రైతులు దళారులకు అమ్ముకుంటున్నారని అన్నారు. క్వింటాకి 2,320 రూపాయలు మద్దతు ధర రావాల్సి ఉండగా దళారులకు 2 వేలు, 2,100 రూపాయలకే అమ్ముకుంటు న్నారని చెప్పారు. అకాల వర్షాలు, వడగండ్ల వానల భయంతో రైతులు కల్లాల్లోనే ధాన్యాన్ని దళారులకు అమ్ముకునే దుస్థితి నెలకొందని హరీశ్‌రావు అన్నారు. గతేడాది వానాకాలంలో మొత్తం 1 లక్షా 53 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరిస్తామని చెప్పి, కేవలం మిగతా 2 లో

### పాకిస్తానీలు వెంటనే దేశం వదిలి...
## వెళ్లిపోవాలి : డీజీపీ ఆదేశాలు



హైదరాబాద్, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** పహల్గా మ్ ఉగ్రదాడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. పాకిస్తాన్‌ను అన్ని రకాలుగా దెబ్బ కొట్టడానికి సిద్ధమైంది. ఇందులో భాగంగా పాకిస్తానీల వీసాలను రద్దు చేసింది. 48 గంటల్లో పాకిస్తానీలు దే శం వదలి వెళ్లిపోవాలని ఆదేశించింది. ఇక, తెలంగాణ పోలీసులు శాఖ కూడా వీసాల రద్దు నేపథ్యంలో రాష్ట్రంలో ఉంటున్న పాకిస్తా నీలకు కీలక ఆదేశాలు జారీ చేసి ...రకు మిగతా 2 లో

# సంపాదకీయం

## పీఓకే విలీనమే పరిష్కారమా...

పహల్గామ్ లో ఉగ్రదాడితో అందాల కశ్మీరం... అల్లకల్లోలంగా మారింది. ఉగ్రతూటాకు ఆ ప్రాంతం అల్లాడిపోయింది. ముష్కరుల రాక్షసకాండకు 26 మంది అమాయకులు బలయ్యారు. దీంతో భారత్, పాక్ మధ్య వివాదం మరింత ముదిరింది. భారత్ సరిహద్దుల్లో ఆయుధాలు సిద్ధం చేసుకుంటూనే... పాక్‌కు వెన్నులో వణుకుపుట్టేలా కఠిన నిర్ణయాలు తీసుకుంటోంది. ఖరాకండిగా పాక్‌తో దౌత్య సంబంధాలు తెంచేసుకుంది.పహల్గామ్ ఉగ్రదాడిని అమెరికా, రష్యా, చైనా, శ్రీలంక, ఇటలీ, ఇజ్రాయెల్, ఫ్రాన్స్, జర్మనీ సహా పలుదేశాలు ఖండించాయి. ఉగ్రవాదుల ఏరివేతకు, ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న దేశాలపై పోరాటంలో మద్దతుగా ఉంటామని ప్రకటించాయి. దీంతో ప్రపంచదేశాల సపోర్టుతో పాక్‌ను భారత్ ఒంటరిని చేసేందుకు ప్లాన్ రెడీ చేస్తోంది.ఇటు జీ20 దేశాల రాయబారులతోనూ భారత విదేశాంగ శాఖ భేటీ అయ్యింది. దౌత్యవేత్తలకు పహల్గామ్ ఉగ్రదాడి గురించి కళ్లకు కట్టినట్లు వివరించారు భారత విదేశాంగ అధికారులు. ఉగ్రవాదాన్ని పాకిస్తాన్ ప్రోత్సహిస్తున్న తీరును? భారత్‌పై పాక్ పదేపదే కవ్వింపులకు దిగుతున్న పరిణామాలను దౌత్యవేత్తలకు తెలియజేశారు. పాక్ కుట్రలను ఇటు అఖిలపక్ష సమావేశంలోనూ వివరించింది కేంద్రం. రాజ్‌నాథ్‌సింగ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాక్ తీరుపై అన్నిపార్టీలు కన్నెర్ర చేశాయి. పాక్ విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నా స్వాగతిస్తామంటూ కాంగ్రెస్ అగ్రనేతలు సైతం మద్దతిచ్చారు.పాక్ ఆక్రమిత కశ్మీర్ విలీనం' భారత్‌లో రాజకీయంగా, భద్రతపరంగా అత్యంత చర్చనీయమైన అంశం. ఈ విషయంపై భారత్‌లో ప్రభుత్వ విధానాలూ, ప్రజల భావోద్వేగాలూ గట్టి స్థాయిలో ఉన్నాయి. పహల్గామ్ ఉగ్రదాడితో మరోసారి పీఓకే విలీనంపై జోరుగా చర్చ జరుగుతోంది. జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదుల దుశ్చర్యకు 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన దేశం మొత్తాన్నిగ్రాగ్భ్రాంతికి గురిచేస్తోంది. అయితే, ఈ దాడిని పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను భారత్ తిరిగి స్వాధీనం చేసుకోడానికి మార్గం సుగమం చేసిందా? పాకిస్థాన్‌తో పూర్తిస్థాయి యుద్ధం జరిగి త్వరలోనే పీఓకే విలీనం అవుతుందా? దాయాది పాకిస్థాన్ కుట్రలకు అడ్డుకట్ట పడుతుందా? అంటే అవుననే సమాధానం వస్తోంది. ఈ దిశగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేయబోతుందని చెబుతున్నారు.ఇదే సమయంలో తాజాగా, ప్రముఖ జ్యోతిషుడు ఏడాది కిందట చెప్పిన జోస్యం ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. పహల్గామ్ దాడి పీఓకేలోని చాలా భూభాగాన్ని భారత సైన్యం స్వాధీనం చేసుకోడానికి కీలక అవకాశం కల్పించిందని, ఈ విషయంలో ఆర్మీ విజయం సాధిస్తుందంటూ రుద్ర కరణ్ ప్రతాప్ అనే జ్యోతిషుడు అంచనా వేశారు. గతంలో ఈయన చెప్పిన జోస్యాలు ఫలించడంతో దీనిపై నమ్మకం పెరిగింది. వాస్తవానికి గతేడాది ఏప్రిల్ మొదటి వారంలోనే ఈ జ్యోతిషుడు.. ప్రధాని మోదీ, పీఓకే స్వాధీనం గురించి జాతకం చెప్పడం విశేషం.ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రస్తుతం కుజ మహదశలోకి ప్రవేశించారని, మూడోసారి ఆయన పదవిలోకి వచ్చి.. దేశ భూభాగానికి సంబంధించిన వివాదాలపై దృష్టిసారించి సత్ఫలితాలు సాధిస్తారన్నారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ ఏప్రిల్ 2025 నుంచి సెప్టెంబరు 2025 మధ్య భారత్‌లో విలీనం అవుతుందని 2024 ఏప్రిల్ 6న ట్వీట్ చేశారు. దీనికి ప్రత్యేక క్రెడిట్ లేదా గుర్తింపు అవసరం లేదంటూ ఎక్స్ (ట్విట్టర్)లో పోస్ట్ పెట్టారు. ఈ పోస్ట్ ప్రస్తుతం వైరల్ అవుతోంది.తాజాగా, పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం అప్పట్లో తాను పెట్టిన పోస్ట్‌ను జ్యోతిషుడు రీపోస్ట్ చేస్తూ.. "ఏప్రిల్ 22, 2025 నాటి సంఘటనలు ఒక కీలకమైన క్షణాన్ని సూచిస్తాయి.. పహల్గామ్‌లో జరిగిన ఒక దారుణమైన, పిరికిపంద ఉగ్రవాద దాడి రెండు దేశాల మధ్య ఉద్రిక్తతను రేకెత్తిస్తుంది..ఈ సమయంలో పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ లోని గణనీయమైన భాగాన్ని భారత సైన్యం తిరిగి స్వాధీనం చేసుకుంటుంది" అని ట్వీట్ చేశారు.దేశ విభజన అనంతరం 1947లో పాకిస్థాన్ ఆక్రమించుకున్న కశ్మీర్‌లోకి కొంత భూభాగమే పీఓకే. దీనిని అధికారికంగా తమ భూభాగంగా భారత్ భావిస్తుంది. సంవిధాన పరంగా జమ్మూ కశ్మీర్ రాష్ట్రం మొత్తం భారత్‌లో భాగమే. పీఓకేను స్వాధీనం తిరిగి స్వాధీనం చేసుకోవడమే లక్ష్యమని భారత పార్లమెంటు 1994లో ఏకగ్రీవంగా తీర్మానించింది కూడా.అయితే, విలీనం అంత ఆషామాషీ కాదు. ప్రస్తుతం పాకిస్థాన్ అధీనంలో ఉన్న పీఓకేలో పాక్ సైన్యం ఆధిపత్యం చెలాయిస్తోంది. ఇటీవల అక్కడ హమాస్ నేతల పర్యటన, ఉగ్రవాద శిబిరాల ఉనికిపై భారత్‌కు ఆగ్రహాన్ని కలిగించాయి. ఉగ్రదాడుల నేపథ్యంలో ఖనీఐపై కేంద్రం మరింత దృష్టి పెట్టే అవకాశాలు ఉన్నాయి.రాజకీయ-దౌత్యపరంగా: అంతర్జాతీయంగా పాక్‌పై ఒత్తిడి తెచ్చి, దానిని భారత్‌కు తిరిగి అప్పగించే మార్గం (కానీ ఇది చాలా కష్టం).రక్షణ చర్య: సైనిక మార్గంలో తిరిగి స్వాధీనం చేసుకోవడం. అయితే, ఇది పూర్తి స్థాయి యుద్ధానికి దారితీయవచ్చు.ప్రజా ఉద్యమాల ద్వారా: పీఓకే లో నివసించే ప్రజలు పాకిస్థాన్ పాలనపై అసంతృప్తిగా ఉండటం, స్వేచ్ఛను కోరడం దీన్ని భారత్ అనుకూలంగా మలచుకోవడం.ఇటీవల కేంద్రంలోని పెద్దలు కొన్ని సందర్భాల్లో పీఓకేను స్వాధీనం చేసుకుంటామని బహిరంగంగా వ్యాఖ్యానించారు. ప్రస్తుతం సరిహద్దు ఉగ్రవాదంపై తీవ్ర స్థాయిలో స్పందిస్తున్న నేపథ్యంలో ఖనీఐపై మరింత దృష్టిసారించే అవకాశం ఉందని అంటున్నారు. మరి ఈ ప్రయత్నాలు ఎంతవరకు సఫలమవుతాయో? జోస్యం ఫలిస్తుందో లేదో వేచిచూడాల్సిందే.

# యుద్ధం వస్తే.. ఎవరి బలం ఎంత.. సైన్యం ఎంత..?

న్యూఢిల్లీ : భారత్ పాక్ మధ్య ఇప్పుడు పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే రెండు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొనగా.. తాజాగా పహల్గామ్ ఉగ్రదాడితో అవి తారస్థాయికి చేరుకున్నాయి. ఇప్పటికే పాకిస్తాన్‌పై అనేక ఆంక్షలు విధించిన భారత్.. కేబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ సమావేశమై 5 కీలక నిర్ణయాలు తీసుకుంది. అందులో సింధూ జలాల పంపిణీ ఆపడం, పాక్ వాసులకు వీసాల రద్దు, అట్టారీ సరిహద్దు మూసివేత, భారత్‌లోని పాక్ అధికారుల తొలగింపు, ఇస్లామాబాద్‌లోని భారత అధికారులను వెనక్కి రప్పించడం వంటి కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ నిర్ణయాలకు ప్రతీకారంగా భారత్‌పై పాక్ కూడా అలాంటి నిర్ణయాలే తీసుకుంది. సిమ్లా ఒప్పందం రద్దు, భారత్‌తో వాణిజ్య సంబంధాలు తెంచుకోవడం, పాక్ ఎయిర్‌స్పేస్‌ను భారత్ ఉపయోగించుకోకుండా అడ్డుకోవడం, భారతీయులకు సార్క్ వీసాలు రద్దు, ఇస్లామాబాద్‌లోని భారత దౌత్య అధికారుల తగ్గింపు సహా పలు నిర్ణయాలు తీసుకుంది. ఈ క్రమంలోనే రెండు దేశాల మధ్య యుద్ధవాతావరణం నెలకొంది.భారత్‌తో పోల్చుకుంటే పాకిస్తాన్ జనాభా పరంగా, సైనిక పరంగా, ఆయుధాల పరంగా, ఆర్థిక పరంగా, రాజకీయ పరంగా, అంతర్జాతీయ సహకారం పరంగా అన్ని రంగాల్లో వెనకబడే ఉంది. ఇప్పటికే అడుక్కుతినే స్థాయిలో ఉన్న పాకిస్తాన్.. భారత్‌తో యుద్ధం వస్తే ఇంకా పాతాళానికి పడిపోతుందనే విషయం తెలిసినా.. ఆ దేశం కవ్వింపు చర్యలకు దిగుతూనే ఉంది. విదేశీ మారక నిల్వలు పూర్తిగా అడుగంటిపోయి.. రోజు గడవాలంటే విదేశాలు, విదేశీ సంస్థలు, అంతర్జాతీయ సంస్థల వద్ద చేతులు చాచి అడుక్కుంటోంది. పాక్ ఆర్థిక వ్యవస్థ తీవ్ర పతనావస్థలో ఉంది. మరోవైపు.. అంతర్గతంగా పాక్‌లో అనేక రాజకీయ, వేర్పాటువాద సవాళ్లు ఉన్నాయి. ప్రభుత్వం, సైన్యం మధ్య కూడా సఖ్యత లేదు. ఒకవైపు ప్రత్యేక దేశం కోసం ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్న బలూచిస్తాన్.. ఇటీవలి కాలంలో పాక్‌కు పెద్ద తలనొప్పిగా మారింది. ఇలాంటి సమయంలో భారత్‌తో యుద్ధం అంటే పాకిస్తాన్ ఇంకా నష్టపోవాల్సిన పరిస్థితే ఉంటుంది.మరోవైపు.. సైనిక పరంగా, ఆయుధాల పరంగా, రక్షణ శాఖ బడ్జెట్ పరంగా చూస్తే.. భారత్‌తో అసలు పాకిస్తాన్ పోటీపడే స్థితిలో కూడా లేదు. భారత్ వద్ద 14 లక్షల మంది సైనికులు ఉండగా.. పాకిస్తాన్ వద్ద కేవలం 6.5 లక్షల మంది సైన్యం మాత్రమే ఉంది. ఇక రిజర్వ్ ఫోర్స్‌లు భారత్ వద్ద 11 లక్షలు ఉండగా.. పాకిస్తాన్‌కు కేవలం 5 లక్షలు మాత్రమే ఉంది. 2024లో భారత రక్షణ బడ్జెట్ 81 బిలియన్ డాలర్లు కాగా.. పాకిస్తాన్ రక్షణ బడ్జెట్ 11 బిలియన్ డాలర్లు మాత్రమే కేటాయించారు. ఫైటర్ జెట్‌లు (సుఖోయ్-30 ఎంకేఐ, రఫేల్) భారత్ వద్ద 600 కంటే ఎక్కువ ఉండగా.. పాకిస్తాన్ వద్ద 350 (జేఎఫ్-17, ఎఫ్-16, మిరాజ్) ఉన్నాయి.యుద్ధ ట్యాంకులు భారత్ వద్ద 4,500కు పైగా ఉండగా.. పాక్ వద్ద కేవలం 2,400 మాత్రమే ఉన్నాయి. నౌకా శక్తిలో భారత్ వద్ద 1 ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్, డిస్ట్రాయర్స్, సబ్‌మెరైన్లు ఉన్నాయి. కానీ పాకిస్తాన్ వద్ద నౌకా శక్తి పరిమిత సంఖ్యలోనే ఉంది. ఇక న్యూక్లియర్ ఆయుధాలు భారత్ వద్ద 160 నుంచి 170 ఉన్నట్లు అంచనా ఉండగా.. అదే పాకిస్తాన్ వద్ద 160 నుంచి 165 అణ్వాయుధాలు ఉన్నట్లు అంచనా ఉంది. ఈ ఒక్క అణ్వాయుధాల విషయంలో మాత్రం భారత్‌ను ఢీకొట్టే సత్తా పాకిస్తాన్‌కు కనిపిస్తోంది. మిస్సైల్ శక్తిలో భారత్ వద్ద అగ్ని, బ్రహ్మోస్ వంటి అగ్రశ్రేణి బాలిస్టిక్ క్షిపణులు, క్రూయిజ్ మిస్సైళ్లు ఉన్నాయి. అదే పాక్ వద్ద షాహీన్, గౌరీ, బాబర్ మిస్సైళ్లు ఉన్నాయి.పహల్గామ్ ఉగ్రదాడిని భారత్ చాలా తీవ్రంగా పరిగణిస్తోంది. అంతేకాకుండా ఈ దాడి చేసిన ఉగ్రవాదులు ఎక్కడ ఉన్నా తీసుకువచ్చి మట్టిలో కలిపేస్తామని.. స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర హెచ్చరికలు చేశారు. కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ కూడా ఇలాగే తీవ్రంగా స్పందించారు. నేరుగా యుద్ధమార్గాన్నే ఎంచుకోకుండా భారత్ పలు దౌత్య, ఆర్థిక పరంగా చర్యలు తీసుకుంటోంది.యుద్ధం విషయంలో భారత్ పెట్టుకున్న రూల్ మాత్రం ఎన్నటికీ మారదు. మొదట ప్రత్యర్థి దాడి చేస్తేనే.. దానికి ప్రతిస్పందించడం తప్ప.. భారత్ ఎన్నడూ మొదట యుద్ధానికి కాలు దువ్వదు. ప్రస్తుతం ఇరు దేశాల సరిహద్దుల వద్ద పర్యవేక్షణ పెరిగినా, సైన్యం, ఆయుధాలను మోహరించినా.. యుద్ధం జరగడం అనేది చివరి పరిష్కారంగా మాత్రమే రెండు దేశాలు భావిస్తున్నాయి. ఎందుకంటే ఒకసారి యుద్ధం గనక ప్రారంభమైతే.. రెండు దేశాలు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. సైనిక పరంగా పాక్ కంటే అత్యంత బలంగా ఉన్న భారత్.. పాక్ కవ్విస్తే తప్ప యుద్ధభూమిలో అడుగుపెట్టదు. అయితే పాక్ వద్ద అణ్వాయుధాలు భారీగా ఉండటం.. తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఒకసారి అణ్వాయుధాలు ప్రయోగిస్తే.. దాని వల్ల కలిగే నష్టం ఊహించడం కూడా చాలా కష్టంగా ఉంటుంది.

## అమరావతి అభివృద్ధికి..



కేంద్ర సహకారం ఆశిస్తున్నట్లు సీఎం ప్రధానికి వివరించినట్లు తెలుస్తోంది. ప్రధానితో భేటీ సానుకూల వాతావరణంలో జరిగినట్లు సమాచారం.

**మోదీ రాక... భారీ ఏర్పాట్లకు ప్రణాళికలు**

అమరావతి పునర్ నిర్మాణ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని వెలగపూడిలోని సచివాలయం వెనుక భాగంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ బహిరంగ సభకు సుమారు 5 లక్షల మంది ప్రజలు హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు. అదే రోజున దాదాపు 30 వేల మందితో ఒక రోడ్‌షో నిర్వహించాలని కూడా యోచిస్తున్నారు. ఇందులో మోదీ, చంద్రబాబు పాల్గొంటారని తెలుస్తోంది. రాష్ట్రంలో ప్రారంభమయ్యే లక్ష కోట్ల రూపాయల విలువైన పనులకు సూచికగా ప్రధాని మోదీ ఒక పైలాన్‌ను కూడా ఆవిష్కరించనున్నారు.

## రాజ్యాంగ పరిరక్షణ...

రిజర్వేషన్ ఎత్తి వేసి.. అవసరమైన మేరకు అమలు చేయాలని అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమంగా తాము ప్రజల్లోకి వెళ్తామని అన్నారు. ఉగ్రవాదుల దాడులను నియంత్రణ చేయడంలో మోదీ ప్రభుత్వం విఫలమైందని ఆరోపణలు చేశారు. పర్యాటకులు చనిపోతుంటే.. అక్కడ ఉన్న భద్రత దళాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. అసలు దాడులు జరుగుతాయనే నిఘావర్గాల సమాచారం ఉందా లేదా అని ప్రశ్నించారు. పక్క దేశం వాళ్లు వచ్చి దాడులు చేస్తే అడ్డుకోలేరా అని షర్మిల నిలదీశారు. మన దేశం మీద జరిగిన ఉగ్రవాద దాడే ఇదని షర్మిల చెప్పారు. మనమంతా కలిసి ఐక్యంగా ఎదుర్కొందామని అన్నారు. బీజేపీ మత రాజకీయాల కోసం ఉగ్రదాడి ఘటనను వాడుకుంటుందని.. ఇది చాలా బాధాకరమని చెప్పారు. అక్కడ ముస్లింలను కూడా చంపేశారని.. అది హిందువులపైన దాడిగా ఎలా చెబుతారని ప్రశ్నించారు. ఆ ప్రాంతం చాలా సురక్షితంగా ఉందని.. మోదీ బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రచారం చేసుకున్నారని గుర్తుచేశారు. వారి మాటలు నమ్మి వెళ్లినందుకు అమాయకులు ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. మరి ఈ విషయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు.

# బాలినేనికి చిక్కని పట్టు..

ఒంగోలు : మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులు రెడ్డి వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరిపోయారు. అయితే తనకు పట్టున్న ఒంగోలు కార్పొరేషన్ కు చెందిన కార్పొరేటర్లను అయితే తనతో పాటు జనసేనలోకి తీసుకు వచ్చారు. అయితే మరికొందరు కీలక నేతలను పార్టీలోకి తీసుకు రావాలన్న ఆయన ఆలోచన మాత్రం కార్యరూపం దాల్చడం లేదని తెలిసింది. ప్రస్తుత పరిస్థితుల్లో జనసేనలోకి వచ్చేందుకు ఎవరూ పెద్దగా సుముఖత వ్యక్తం చేయడం లేదని సమాచారం. అందుకే బాలినేని శ్రీనివాసులు రెడ్డి ఎంతగా ప్రయత్నించినా కొందరు నేతలు సున్నితంగా తిరస్కరిస్తుండగా, మరికొందరు నేతలు మాత్రం తాము వైసీపీని వదిలి రాలేమని తెగేసి చెబుతున్నారు. జిల్లాపై పట్టున్న నేతగా... బాలినేని శ్రీనివాసులు రెడ్డి కాంగ్రెస్ లో ఉన్నప్పటి నుంచే ప్రకాశం జిల్లాను తన చెప్పు చేతల్లో పెట్టుకుని ఉన్నారు. నాడు పీసీసీ చీఫ్ గా, తర్వాత ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డికి సమీప బంధువు కావడంతో ఆయన చెప్పిందే మాట.. చేసిందే శాసనం అన్నట్లు ఉండేది. నాటి నుంచి 2019 ఎన్నికల వరకూ బాలినేని శ్రీనివాసులు రెడ్డి చెప్పిన వారికే టిక్కెట్లు దక్కేవి. అందుకే బాలినేని అందరు నేతలతో టచ్ లో ఉంటారు. వారు కూడా బాలినేని ప్రాపకం కోసం పాకులాడేవారు. అలాంటిది 2024 ఎన్నికల్లో ఓటమి తర్వాత బాలినేని వైసీపీకి రాజీనామా చేయడం, తర్వాత జనసేనలో చేరిపోవడం ఒకరకంగా మిగిలిన నేతలకు కూడా షాకింగ్ కు గురి చేశాయి.కానీ బాలినేని శ్రీనివాసులు రెడ్డి పార్టీని వీడితే అనేక మంది నేతలు కూడా ఆయన వెంట పోలోమంటూ క్యూ కడతారని భావించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా అదే ఊహించారు. అందుకే బాలినేనికి అంత ప్రాధాన్యత ఇచ్చారు. కానీ బాలినేని చేరి నెలలు కావస్తున్నా ఒక్క పేరున్న నేత కూడా ప్రకాశం జిల్లా నుంచి రాకపోవడం జనసేనలోనూ చర్చనీయాంశమైంది. కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న పరిణామాలు, హామీలు అమలు చేయకపోవడం, తిరిగి జగన్ పుంజుకునే అవకాశాలుంటాయన్న అంచనాలు వినపడుతుండటంతో నేతలు పార్టీని వీడి వచ్చేందుకు సుముఖంగా లేరని చెబుతున్నారు. బాలినేని వదలకుండా ప్రయత్నిస్తున్నా కార్పొరేటర్లు మినహా మరో ముఖ్యనేత ప్రకాశం జిల్లాలో ఆయన వెంట రాకపోవడానికి ఇదే కారణమని అంటున్నారు. ప్రకాశం జిల్లా రాజకీయాల్లో బాలినేని శ్రీనివాసరెడ్డికి ప్రత్యేక స్థానం ఉంది. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా గెలిచి.. నాటి వైఎస్ రాజశేఖరరెడ్డి కేబినెట్‌లో మంత్రిగా బాలినేని పని చేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ఆకస్మిక మరణంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో వైఎస్ రాజశేఖరరెడ్డి తనయుడు వైఎస్ జగన్ కాంగ్రెస్ పార్టీని వీడి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ స్థాపించారు.దీంతో బాలినేని సైతం కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి.. వైఎస్ జగన్ అడుగులో అడుగు వేసి నడిచారు. ఆయన ఒంగోలు ఎమ్మెల్యేగా ఆరుసార్లు గెలిచారు. ఇక 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచి జగన్ కేబినెట్‌లో స్థానం సంపాదించారు. రెండున్నరేళ్ల తర్వాత జగన్ కేబినెట్‌ను పునర్ వ్యవస్థీకరించారు. దీంతో మంత్రి పదవిని బాలినేని కోల్పోయారు.అయితే వైఎస్ జగన్ కుటుంబంతో బాలినేనికి సమీప బంధుత్వం ఉంది. అయినా ఆయన్ని కేబినెట్ నుంచి తొలగించడంతో తీవ్ర మనో వేదనకు గురయ్యారనే గట్టి ప్రచారం అయితే జిల్లా గట్టిగానే సాగింది. అందువల్లే నాటి నుంచి పార్టీ అధిష్టానానికి ఆయన సాధ్యమైనంత దూరంగా ఉన్నారనే చర్చ సైతం సాగింది. ఇక ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీ అధికారానికి దూరమైంది. ఎమ్మెల్యేగా సైతం బాలినేని ఓటమి పాలయ్యారుపార్టీ వీడేందుకు ఆయన సిద్ధమయ్యారు. ఇదే విషయాన్ని పార్టీ అధినేత వైఎస్ జగన్ వద్ద కుండ బద్దలు కొట్టారు. బాలినేనికి నచ్చ జెప్పేందుకు పార్టీ అధినేతే కాదు.. అగ్రనేతలు సైతం ప్రయత్నించారు. కానీ బాలినేని మాత్రం వారి సూచనలు సలహాలు పట్టించుకోలేదు

## వడ్ల కొనుగోలులో...

52 వేల మెట్రిక్ టన్నులే సేకరించగలిగిందని అన్నారు. మిగతా 90 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని బయటకు వదిలేసిందని.. అంటే మూడొంతుల్లో ఒక వంతు మాత్రమే కొనుగోలు చేయగలిగిందని అన్నారు. రెండొంతుల ధాన్యాన్ని రైతులు తక్కువ ధరకు అమ్ముకున్నారని చెప్పారు. యాసంగి పంటకు కూడా ప్రభుత్వంలో అదే నిర్లక్ష్యం కనబడుతోందని అన్నారు. ఇది రైతు కంటక ప్రభుత్వం అని హరీశ్‌రావు అన్నారు. రుణమాఫీ చేస్తామని చెప్పి సగం మందికి చేయలేదని.. రైతు బంధుని వానకాలంలో ఎగ్గొట్టి యాసంగిలో రెండు మూడు ఎకరాలకే ఇచ్చారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అకాల వర్షాలు, గాలి దుమారం వల్ల మూడు నాలుగు లక్షల ఎకరాల్లో పంట దెబ్బతిన్నది. అందుకు ఎకరాకి 20 వేల రూపాయలను ఇన్‌పుట్ సబ్సిడీగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. తక్షణమే జిల్లా కలెక్టర్ల ద్వారా నివేదిక తెప్పించుకొని రైతులను ఆదుకోవాలన్నారు. నంగునూరు మండలం పాలమాకుల వడ్ల కొనుగోలు కేంద్రంలో వడ్లు కొని వారం అయినా ఇంకా రైతులకి డబ్బులు ఇవ్వలేదని హరీశ్‌రావు మండిపడ్డారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఏమో 48 గంటల్లో రైతులకు డబ్బులను అకౌంట్‌లో వేస్తున్నామని హైదరాబాద్‌తో చెబుతారని అన్నారు. గన్నీ బ్యాగులు నాణ్యంగా లేకపోవడం వల్ల హమాలీలకు ఇబ్బందిగా ఉందని.. తూకంలో క్వింటాకి రెండు కిలోలు తరుగు తీస్తున్నారని మండిపడ్డారు. అటు అకాల వర్షాలు, ఇటు రైతు బంధు, మద్దతు ధర రాక ఇబ్బందులు పడుతున్న రైతాంగాన్ని వెంటనే ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



## ఎస్పీ అన్న ప్రసాదం ట్రస్టుకు...



స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహణ ఉంటుందని తెలిపారు. అనంతరం ఆలయంలో ఊంజల్‌సేవ జరుగనుందని అన్నారు. మే 2న ఆలయంలో పుష్పయాగానికి అంకురార్పణ, 3న ఆలయంలో సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు పుష్పయాగం, 12న పౌర్ణమి నాడు అష్టోత్తర శతకలశాభిషేకం నిర్వహణ ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా సాయంత్రం శ్రీ సీతా లక్ష్మణ సమేత కోదండరామస్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపు, 18న అన్నమాచార్య కళామందిరంలో ఆస్థానం, 22న హనుమజయంతి , 27న సహస్ర కలశాభిషేకం, 30న పునర్వసు నక్షత్రం సందర్భంగా సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహిస్తామని వెల్లడించారు.

## అమాయకులను చంపడం...



రావి సౌజన్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మీడియాతో మాట్లాడారు. ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపు మేరకు మూడు రోజుల పాటు నిరసన కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. బాధిత కుటుంబ సభ్యులకు తామంతా అండగా ఉంటామని పవన్ కల్యాణ్ చెప్పారని అన్నారు. జనసేన ప్రతి నియోజకవర్గంలో చైతన్యం తెచ్చేలా కార్యక్రమాలు చేపట్టిందని మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. ముందు మన దేశం, మన రాష్ట్రం ఆ తర్వాతే మనమని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఎంత బాధ ఉన్నా ఇలాంటి ఘటనల సమయంలో మనమంతా ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కావలిలో జనసేన నేత మధుసూదనరావు భౌతికకాయాన్ని చూసి పవన్ కల్యాణ్ చలించిపోయారని అన్నారు. జరిగిన దుర్ఘటన అతని భార్య చెబుతుంటే తమ కంట కన్నీరు ఆగలేదని చెప్పారు. అంత ఘోరంగా, అన్యాయంగా పర్యాటకులను చంపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమయంలో భారతీయ పౌరులంతా ప్రధానమంత్రి నరేంద్రమోదీకి అండగా ఉండాలని సూచించారు. జనసేన పక్షాన కొవ్వొత్తుల ర్యాలీ, నిన్న మౌన దీక్ష లయ, ఇవాళ మానవహారం నిర్వహించామని మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. మన జెండా చూసి ఎంత గర్వ పడతామో.. అదే విధంగా మనం కలిసి ఉండాలని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. బాధిత కుటుంబాలకు మనం అండగా ఉన్నామనే భరోసా ఇవ్వాలని చెప్పారు. ఉగ్రవాదుల దుశ్చర్యలకు తప్పకుండా కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పి తీరుతుందని.. వారికి సహకరించిన వారిపై కూడా చర్యలు ఉంటాయని తెలిపారు. ఇప్పుడు రాజకీయాలు, కుల, మతాలు చూడవద్దని అన్నారు. మనం భారతీయులుగా మన వాళ్లకు అండగా నిలుద్దామని చెప్పారు. పవన్ కల్యాణ్ నాయకత్వంలో ప్రజల్లో చైతన్యం తెస్తామని అన్నారు. బాధిత కుటుంబాలకు జనసేన పక్షాన కూడా సాయం చేసేలా ఆలోచన చేస్తున్నామని తెలిపారు. భద్రత విషయంలో ఎక్కడా రాజీపడకుండా ముందుకు వెళ్తామని చెప్పారు. నిఘా వర్గాలు ఇచ్చే సమాచారం ఆధారంగా అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

## పాకిస్తాన్‌లోని ఆంధ్రులు...

ఉన్న మరో 90 వేల మందికి కూడా వచ్చే నెల ఒకటో తేదీన పెన్షన్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. తద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రూ.35 కోట్లు అదనపు భారం పడనుందని చెప్పారు. డెత్ సర్టిఫికెట్స్, ఆధార్ కార్డు తీసుకుని ఫించన్ మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. అర్హులు అందరూ ఈ నెల 30వ తేదీకి ధ్రువపత్రాలు అందజేయాలని సూచించారు. ఏపీవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు నెలకొల్పాలని ఆలోచన చేసి ఆ దిశగా ఆచరణ చేస్తున్నామని అన్నారు. వచ్చే నెల ఒకటో తేదీన నెల్లూరులో ఒక పార్కును ప్రారంభించి అక్కడి నుంచే వర్చువల్‌గా మరొక 50 పార్కులను ప్రారంభిస్తామని తెలిపారు. రెండేళ్లలో 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులను ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు.

## పాకిస్తానీలు వెంటనే దేశం వదిలి...



రాష్ట్ర డీజీపీ జితేందర్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రకటనలో ..'తెలంగాణలో ఉన్న పాకిస్తానీలు వెంటనే తమ దేశానికి వెళ్లిపోవాలి. పాకిస్తానీల వీసాలు 27 తర్వాత పనిచేయవు. మెడికల్ వీసాల మీద ఉన్నవారికి ఏప్రిల్ 29 వరకు మాత్రమే గడువు ఉంది. లాంగ్ టర్మ్ వీసాలు కలిగిన వారికి ఈ నిబంధన వర్తించదు. పాకిస్తానీలు తమ దేశానికి అటారి బార్డర్ నుంచి వెళ్లొచ్చు. ఈనెల 30 వరకు అటారి బార్డర్ తెరుచుకుని ఉంటుంది. కేంద్ర ప్రభుత్వ నిబంధనలు ప్రకారం పాకిస్తానీలు తమ దేశానికి వెళ్లిపోవాల్సిందే. ఒకవేళ అక్రమంగా తెలంగాణలో ఉంటే న్యాయపరంగా చర్యలు తీసుకుంటాము' అని స్పష్టం చేశారు.

## ఏ బి హెల్పింగ్ హాండ్స్ చలివేంద్రం నీ......
## ప్రారంభించనున్న ఎమ్మెల్యే డాక్టర్ థామస్



ఎస్ఆర్ పురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 25: ఎస్ఆర్ పురం మండలం పుల్లూరు క్రాస్ జంక్షన్ లో ఏ బి హెల్పింగ్ హాండ్స్ ట్రస్ట్ నిర్వాహకులు ఎన్నారై డాక్టర్ భాస్కర్ రెడ్డి చందన రెడ్డి దంపతులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం మధ్యాహ్నం ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ప్రారంభిస్తారు. అలాగే మండల కార్యాలయం వద్ద ఆరిమాని గంగమ్మ గుడి వద్ద జనసేన పార్టీ నాయకులు పుల్లూరు సర్పంచ్ భవ్య పవన్ ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని, ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ప్రారంభిస్తారు. కావున మండల ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.

## మహిళలకు ఉచిత టైలరింగ్ పై శిక్షణ

శాంతిపురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 25 : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజక వర్గంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు శాంతి పురం మండలంలో ఆసక్తిగల మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు శుక్ర వారం ఎంపీడీవో కుమార్ తెలిపారు. మండలంలోని చౌడంపల్లి గ్రామంలో హార్టి కల్చర్ కార్యాలయంలో త్వరలో ప్రారం భించనున్న శిక్షణ కేంద్రంను ఎంపీడీవో పరిశీలించారు. రాళ్లబూదుగురు, తుమ్మిసి, మరియు చౌడంపల్లి గ్రామాలలో ఈ శిక్షణ కేంద్రాలను ప్రారంభించినట్లు చెప్పుకొచ్చారు. దీనికిగాను 380 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకు న్న వారికి శిక్షణ ఇవ్వడానికి సుక్షితులైన టైలర్ లను ఎంపిక చేసినట్లు ఎంపీడీవో తెలిపారు. దీని ద్వారా మహిళలకు వృత్తి నైతన్యం పెంచుకొని వారి ఆర్థిక స్వలంబన కు దోహదపడుతుందని తెలిపారు. శిక్షణ అనంతరం అర్హులందరికీ ఉచిత కుట్టు మిషన్లు ఇవ్వనున్నట్లు తెలిపారు.



## రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు...
## చిత్రపటానికి పాలాభిషేకం



కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్ ఏప్రిల్ 25: కుప్పం పట్టణంలో టిటిడి బోర్డు నెంబర్ శాంతారాం ఒక ప్రకటనలో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు నాయీ బ్రాహ్మణుల పక్షపాతి అని పేర్కొన్నారు. అనంతరం ఆయన టీడీపీ నాయకులతో కలిసి సీఎం చంద్రబాబు నాయుడు చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. నాయీ బ్రాహ్మణుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి ఎల్లప్పుడూ సహకరిస్తున్నారని తెలియ జేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మునిరత్నం,డాక్టర్ సురేశ్ బాబు, గోపీనాథ్ , తదితరులు పాల్గొన్నారు.

## మలేరియా దినోత్సవం పై ......
## అవగాహన ర్యాలీ



పీలేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 25: అన్నమయ్య జిల్లా పీలేరు మలేరియా రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ తెలిపారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని తలుపుల రేగల్లు పి హెచ్ సి వద్ద ఆరోగ్య సిబ్బంది, నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన మాట్లాడారు దోమల వృద్ధి చెందకుండా దోమ కాటుకు గురికాకుండా జాగ్రత్తలు చేపట్టాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్స్ ప్రీమియర్ లీగ్ -13వ ఎడిషన్ ఘన ముగింపు
### పి ఈఎస్ వైద్య కళాశాలలో ఉత్సాహభరిత ఫైనల్‌తో క్రికెట్ పండుగ ముగిసింది





కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 25: పి ఈఎస్ వైద్య కళాశాల(పి ఈఎస్ ఐ ఎం ఎస్ ఆర్), కుప్పం నిర్వహించిన ప్రతిష్టాత్మ కమైన డాక్టర్స్ ప్రీమియర్ లీగ్ (డి పి ఎల్) – 13వ ఎడిషన్, ఉల్లాసంగా, ఉత్సాహంగా ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో తరుణ్'స్ లెజెండ్స్ జట్టు, పురుషోత్తమ్'స్ పాంథర్స్ పై అద్భుత విజయం సాధించి 13వఎడిషన్ డీపీఎల్ ట్రోఫీని గెలుచుకుంది. ఉత్కంఠ భరితంగా సాగిన ఈ ఫైనల్‌ను చూసేందు కు విద్యార్థులు,అధ్యాపకులు,సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరై ఆటగాళ్లకు ఉత్సాహాన్ని చ్చారు. ఈ టోర్నమెంట్ లో ఉత్తమ ప్రదర్శ నల ఆధారంగా క్రింది విభాగాల్లో ప్రత్యేక బహు మతులు ప్రకటించబడ్డాయి: బెస్ట్ బ్యాట్స్‌మన్ ఆఫ్ ది టోర్నమెంట్ – డా. కల్యాణ్ ,బెస్ట్ బౌలర్ ఆఫ్ ది టోర్నమెంట్ – డా. సాయికుమార్ బెస్ట్ ఫీల్డర్ ఆఫ్ ది టోర్న మెంట్ – డా. సాయి తరుణ్,ముగింపు సభ లో డీన్,ప్రిన్సిపాల్ డా. హెచ్. ఆర్. కృష్ణరావు టోర్నీ విజేతలకు ట్రోఫీలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ, "ఇలాంటి క్రీడా కార్యకలాపాలు విద్యార్థుల లో ఐక్యతను,ఆరోగ్యవంతమైన పోటీభా వాన్ని,మానసిక శ్రేష్ఠతనుపెంపొందిస్తాయి," అని చెప్పారు. డా. శశి భూషణ్,డా. కల్యాణ్, డా. భరత్,డా. సంతోష్ ఆధ్వర్యంలోజరిగిన ఈ టోర్నమెంట్,పి ఈఎస్ ఐ ఎం ఎస్ ఆర్ క్రీడా సంస్కృతికి ఒక కొత్త మైలురాయిగా నిలిచిందని తెలియజేశారు.

## వంశీ ఇంకెన్నాళ్లు...

విజయవాడ : గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని పోలీసులు అరెస్టయి దాదాపు డెబ్భయి రోజులు అవుతుంది. అయినా ఆయన ఇంకా జైలులోనే మగ్గుతున్నారు. కేసుల మీద కేసులు ఆయనపై వరస పెట్టి పెడుతున్నారు. అందుకోసమే బెజవాడ జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. వల్లభనేని వంశీని టీడీపీ కార్యాలయంలో ఉన్న సత్యవర్ధన్ కిడ్నాప్, బెదిరింపుల కేసులో వల్లభనేని వంశీని ఈ ఏడాది ఫిబ్రవరి 13న అరెస్ట్ చేశారు. అంటే నేటికి వల్లభనేని వంశీ అరెస్టయి దాదాపు డెబ్భయి రోజులవుతుంది. కొన్ని కేసుల్లో బెయిల్ వస్తున్నా మరికొన్ని కేసుల్లో మాత్రం బెయిల్ లభించడం లేదు. అందుకే ఆయన విజయవాడ జిల్లా జైలులోనే మగ్గిపోతున్నారు.. గన్నవరం పోలీస్ స్టేషన్ లో నమోదైన రెండు కేసుల్లో పీటీ వారెంట్లు జారీ అయ్యాయి. వారెంట్లపై నేడు విచారణ చేపట్టనున్న న్యాయస్థానం నిర్ణయాన్ని వెలువరించనుంది. కేవలం సత్యవర్ధన్ కిడ్నాప్, బెదిరింపుల కేసులతో పాటు గన్నవరం నియోజకవర్గంలో ఇసుక, గ్రావెల్స్ అక్రమ తవ్వకాలపై కూడా కేసులు నమోదయ్యాయి. అదే సమయంలో గన్నవరం టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసులోనూ వల్లభనేని వంశీ నిందితుడిగా ఉన్నారు. వీటికి తోడు భూ కబ్జాల ఆరోపణలపై కూడా వంశీపై అనేక కేసులు నమోదు కావడంతో ఒక దాంట్లో బెయిల్ వస్తే మరొక కేసు మెడకు చుట్టుకుంటుంది. ఫిబ్రవరి 13న... వైసీపీ అధికారంలో ఉండగా వల్లభనేని వంశీ వ్యవహరించిన తీరుపై ఆగ్రహంగా ఉన్న కూటమి ప్రభుత్వం వల్లభనేని వంశీని అరెస్ట్ చేస్తుందని ముందే తెలిసినప్పటికీ ఇలా వరస కేసులు వచ్చిపడతాయని ఊహించలేదు. సోషల్ మీడియాలో టీడీపీ క్యాడర్ ప్రభుత్వాన్ని నిలదీస్తుండటంతో ఇక ఫిబ్రవరి 13న పకడ్బందీగా కేసులు నమోదు చేసి అరెస్ట్ చేశారు. వల్లభనేని వంశీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గన్నవరం నియోజకవర్గాన్ని వదిలేసి హైదరాబాద్ లోనే ఉంటున్నారు. అక్కడే మకాం వేశారు. అయితే పోలీసులు మాత్రం అన్నికోణాల్లో ఆలోచించి వరస కేసులు నమోదవుతుండటంతో ఇప్పట్లో వల్లభనేని వంశీ బయటకు వచ్చే అవకాశం కనిపించడం లేదు. తాను వేసిన సింగిల్ బ్యారక్ కాదని, అందరిలోనూ కలిపి ఉంచాలని, బయట నుంచి ఆహారాన్ని తెప్పించుకునేందుకు అవకాశం ఇవ్వాలని వల్లభనేని వంశీ గతంలో న్యాయస్థానాన్నిఆశ్రయించారు. అదే సమయంలో మిగిలిన ఖైదీలతో పాటు తనను ఉంచాలని కూడా కోరారు. తనకు ప్రాణభయం ఉందని కూడా వల్లభనేని వంశీ చెప్పారు. అయితే వరసగా కేసులు నమోదవుతుండటం, ఒక కేసులో బెయిల్ వచ్చినా మరొక కేసులో అరెస్ట్ చేయడానికి పోలీసులు అన్నీ సిద్ధం చేస్తున్నారు. అందుకే వల్లభనేని వంశీ ఇప్పట్లో బయటకు వచ్చేందుకు ఛాన్స్ లేదు. ఇంకా బెజవాడలోని మండుటెండలకు మరికొద్ది కాలం జైలులోనే ఉండి పోవాల్సి పరిస్థితులు ఉన్నాయంటున్నారు.

**కేడర్ లోనూ నిరుత్సాహం :** గత ఏడాది జరిగిన అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఘోరంగా పరాజయం పాలైన వైసీపీని చాలా మంది వదిలేశారు. కీలక రెడ్డి నాయకుల నుంచి అనేక మంది బీసీల వరకు.. కూడా పార్టీకి దూరమయ్యారు. ఈ క్రమంలో ఇప్పుడు కీలకమైన కార్యకర్తల వంతు వచ్చింది. ఏ పార్టీకైనా.. నాయకులతోపాటు.. కార్యకర్తలు చాలా కీలకం. నాయకులు జంప్ చేస్తారు..కానీ.. కార్యకర్తలు మాత్రం ఎంతో కొంత అంకిత భావంతో పార్టీలను అంటిపెట్టుకుని ఉంటారు. ఎన్నికల సమయంలోనూ..వారే కీలకం. ఈ విషయాన్ని గుర్తించే.. దాదాపు అన్ని పార్టీలూ..కార్యకర్తలే తమకు బలమని.. కార్యకర్తలకు ప్రాధాన్యం ఇస్తామని చెబుతాయి. కార్యకర్తల సెంట్రిక్‌గా అనేక కార్యక్రమాలు కూడా చేపడతాయి. అయితే.. వైసీపీ విషయానికి వస్తే.. కార్యకర్తలనను పక్కన పెట్టిన విషయం తెలిసిందే. గత వైసీపీ హయాంలో వలంటీర్లే సర్వస్వంగా అప్పట్లో సీఎం జగన్ వ్యవహరించారు. ఇది పార్టీకి మేలు చేయకపోగా.. ఓడించేసింది. తద్వారా.. పార్టీ నామరూపాలు లేకుండా పోయిందన్న చర్చ ఉంది. ఇంత పరాభవం తర్వాత.. ఒకటి రెండు సార్లు.. కార్యకర్తలకు ప్రాధాన్యం ఇస్తున్నానని జగన్ చెప్పుకొచ్చా రు. కానీ.. నెలలు గడిచిపోతున్నా.. ఆయన కార్యకర్తల విషయంలో ఎలాంటి నిర్ణయాలూ తీసుకోవడం లేదు. గుర్తింపు అంతకన్నా లేదు. పైగా.. టీడీపీ సహా కూటమి నాయకులు.. కార్యకర్తలపై పోరాటాలు చేయాలని పిలుపునిస్తున్నారు. ఇదే జరిగితే.. జైలుకు వెళ్తోంది.. కార్యకర్తలు, నాయకులే. కనీసం వారిని పరామర్శించడంలోనూ.. న్యాయపరంగా రక్షణ కల్పించడంలోనూ..వైసీపీ అధినేత విఫలమవుతున్నారు. ఆయా విషయాలను గమనిస్తున్న వైసీపీ కార్యకర్తలు.. ఇప్పుడు ప్లేట్ మార్చేస్తున్నారు. టీడీపీ కానీ.. జనసేన కానీ..కార్యకర్తలకు ఇస్తున్న ప్రాధాన్యాన్ని వారు గుర్తించారు. సీఎం చంద్రబాబు సైతం..తన ప్రొటోకాల్ ను పక్కన పెట్టి మరీ.. కార్యకర్తలు, నాయకుల ఇళ్లకు వెళ్లి కష్టాల్లో ఉంటున్నవారిని ఆదుకునే ప్రయత్నం చేస్తున్నారు. భరోసా కల్పిస్తున్నారు. ఈ పరిణామాలతో వవైసీపీలో అలజడి రరేగింది. ఇంకా పార్టీని నమ్ముకుని ఇక్కడే ఉంటే కష్టమనిభావిస్తున్న వారు.. జెండా మార్చేసేందుకు రెడీ అయ్యారు. గుంటూరు, కృష్ణా, నెల్లూరు, ఉభయ గోదావరి జిల్లాల్లో అనేక మంది కార్యకర్తలు.. గత రెండు రోజుల్లోనే టీడీపీ, జనసేనల బాటపట్టడం గమనార్హం

## వ్యవసాయ సహకార సంఘం ద్వారా .....
## ఋణాలు మంజూరు పై
## అవగాహన కార్యక్రమం




వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 25: వెదురుకుప్పం మండలంలో ఉన్న చవటగుంట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా ఋణాలు మంజూరు పై రైతులకు శుక్రవారం అవగాహన కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతులు భుసార పరీక్షలు చేయించు కోవాలి.

గుడిపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 25: నేల లోని సూక్ష్మ మరియు స్థూల పోషకాలు, సేంద్రియ కర్బనము, పరిస్థితి తెలుసుకోడానికి రైతులందరూ భుసార పరీక్షలు చేయించుకోవాలని గుడుపల్లి మండల వ్యవసాయ అధికారి నాగరాజు కోరారు. గుడుపల్లి మండలం లోని రైతులకు ఉచితంగా భుసార పరీక్షలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కనమనపల్లిలో భూసార పరీక్ష కోసం మట్టిని సేకరించే విధానన్ని పరిశీలించి తగిన సూచనలు చేశారు. భుసార పరీక్షలు చేపించుకొని అందుకు అనుగుణంగా ఎరువులు వాడటం ద్వారా ఎరువుల పెట్టుబడి తగ్గించుకోవచ్చు అన్నారు. నేల లోని సారం తగ్గి దిగుబడులు సరిగ్గా రావడం లేదు అన్నారు. అవసరం ఉన్న లేకున్నా అధిక ఎరువులు వాడటం ద్వారా నేల సాగుకు పనికి రాకుండా చౌడు భూములుగా మారుతున్నాయి అని, నేల పరీక్ష లు చేసుకోవడం ద్వారా భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా తగిన చర్యలు తీసుకోని ఎరువులు వాడటం వల్ల చౌడు భూములు మరియు క్షార భూములను కూడా బాగు చేస్కోవచ్చు అన్నారు. రైతులు ప్రతి 2-3 సంవత్సరములకు ఒక సారి తప్పకుండా భుసార పరీక్షలు చేయించుకోవాలి అన్నారు. భూసార పరీక్షలు చేయించు కోవాలని అనుకున్న రైతులు మీ రైతు సేవా కేంద్రం సిబ్బంది ని సంప్రదించినచో వారే మీ పొలాలకు వచ్చే మట్టి నమూనాలు తీసి పరీక్షా కేంద్రానికి పంపిస్తారని , భూసార పరీక్షా ఫలితాలు వచ్చిన వెంటనే భూసార పరీక్ష పత్రాలు కూడా అందజేస్తారని ఆ భూసార పరీక్ష పత్రం అనుగుణంగా రైతులు ఎరువులు వాడటం ద్వారా తక్కువ పెట్టుబడితో నాణ్యమైన అధిక దిగుబడి పొందవచ్చు అని రైతులందరూ కూడా ఈ అవకాశం ను ఉపయోగించుకోవాలని తెలిపారు.



## ఎ1 ఫౌండేషన్(ఎన్ జి ఓ) ఆధ్వర్యంలో...
## కొవ్వొత్తుల నిరసన..




వి.కోట,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 25: చిత్తూరు జిల్లా,పలమనేరు నియోజక వర్గం,వి.కోట పట్టణంలో ఎ1 ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద కాశ్మీర్ లో పర్యాటకులపై జరిగిన పాక్ ప్రేరేపిత ఉగ్రదాడులను ఖండిస్తూ నిరసన తెలిపి,దాడులలో ప్రాణాలు కోల్పోయిన 28 మందికి సంతాపం తెలియజేశారు. ఈ కార్యక్రమం లో ఎ1 ఫౌండేషన్ స్టేట్ జాయింట్ సెక్రటరీ జిక్రియ, చిత్తూరు జిల్లా వైస్ ప్రెసిడెంట్ మునాఫ్,జాయింట్ సెక్రటరీ నాగరాజ్ జేమ్స్,సెక్రటరీ హరి,మెంబర్ తమలపాకుల రెడ్డెమ్మ ,ఉబేదుల్లా, ప్రజలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన.....
## ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్,
## ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం,

కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 25: బాధిత కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకో వడానికి ప్రభుత్వం 1 లక్షా 50 వేల రూపా యలు చెక్కు విడుదల చేసింది. ఈ చెక్కును ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబులు బాధిత కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొంతకాలం క్రితం కుప్పం పట్టణంలో చోటుచేసుకున్న ప్రమాదంలో చందం గ్రామం హరిజన వాడకు చెందిన మురుగేష్ ప్రాణాలు కోల్పోవడం జరిగిందన్నారు. పెయింటర్ గా పనిచేస్తూ జీవనం కుటుంబ పోషణ చేసుకుంటున్న వ్యక్తి ప్రమాదవశాత్తు మరణించిన విషయం తెలుసుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పిస్తూ ఆర్థిక సాయాన్ని అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్, మండల పార్టీ అధ్యక్షులు ప్రేమ్ కుమార్, మాజీ ఎంపీటీసీ డాక్టర్ వెంకటేష్, గోపీనాథ్, స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి.....
## మూడో రోజు సంతాప దినాలు నిర్వహించిన..
## జనసేన కుప్పం నియోజకవర్గం ఇన్చార్జ్ నరేశ్

కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 25: జమ్మూ కాశ్మీర్ పహల్గాంలో జరిగిన ఉగ్ర దాడిని ఖండిస్తూ ఉపముఖ్యమంత్రి పవన్ ఆదేశాలతో కుప్పంపట్టణం లోని బస్టాండు ప్రాంగణంలో మూడో రోజు జనసైనికులు సంతాపదినాలను నిర్వహించారు. ఉగ్రదాడిలో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని జనసేన కుప్పం నియోజకవర్గం ఇన్చార్జ్ నరేశ్ ఆకాంక్షించారు. ప్రధాని మోదీ నేతృత్వంలో ఉగ్రవాదులను అంతం చేస్తారని ఆయన స్పష్టం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కుప్పం జనసేన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు.



## పహల్గాం ఉగ్రదాడికి నీరసంగా జనసేన మానవహారం

బుచ్చినాయుడు కండ్రిగ,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 25: పహల్గాం ఉగ్రదాడికి నీరసంగా జనసేన నాయకులు మండల కేంద్రంలో మానవహారం నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు శుక్రవారం సాయంత్రం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణంలో జనసేన మండల పార్టీ అధ్యక్షులు భాష, కొత్తపాలెం సర్పంచ్ కేతారి హరి ప్రసాద్, పార్లపల్లి సర్పంచ్ చలపతి ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించి ఉగ్రవాది దాడులకు నీరసంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉగ్రవాదులు పిరికిపందుల ఇండియన్ ఆర్మీ దుస్తులు ధరించి విహారయాత్రకు వచ్చిన విహారయాత్ర టూరిస్టులపై కాల్పులు జరిపి హతమార్చడం పిరికిపంద చర్య దమ్ముంటే ధైర్యంగా భారత సైన్యంతో పోరాడి గెలుచుకోవాలని సవాల్ చేశారు. భారతదేశం కన్నెర్ర చేస్తే పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థలు నాశనం అవుతాయని, భారతదేశ సహనాన్ని పరీక్షించవద్దని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో జనసేన మండల పార్టీ అధ్యక్షులు భాష, కొత్తపాలెం సర్పంచ్ కేతారి హరి ప్రసాద్, పార్లపల్లి సర్పంచ్ చలపతి, బాలాజీ, మురళి, వేలు, జగదీష్, హరిబాబు, వెంకట ముని, వెంకటేశు, కార్తీక్, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.




## అమల్లోకి ఇంటర్
## బోర్డులో సంస్కరణలు

గుంటూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు ఇంటర్ విద్యలో పలు సంస్కరణలు తీసుకువస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో ఐదు సబ్జెక్టులకు బదులు ఆరు సబ్జెక్టులను ఎంచుకోవల్సి ఉంటుంది. అయితే విద్యార్థులు ఎంపిక చేసుకున్న ఆరో సబ్జెక్టులో ఉత్తీర్ణత తప్పనిసరి కాదని ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించింది. ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో తీసుకువచ్చిన అనేక సంస్కరణలపై సందేహాలు వ్యక్తమవుతుండటంతో బోర్డు ఈ మేరకు స్పష్టత ఇచ్చింది. ఫస్ట్ ఇయర్‌లో పార్ట్ 1 కింద ఇంగ్లిస్ సబ్జెక్టు ఉంటుంది.



# ఉత్తరాఖండ్‌లో నా పేరుతో గుడి ఉంది : ఊర్వశీ రౌతేలా

బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలా మరోసారి తన వ్యాఖ్యలతో ఆన్‌లైన్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల 'డాకు మహారాజ్' సినిమాతో నవ్వులపాలైన ఈ నటి, ఇప్పుడు నమ్మశక్యం కాని మరో వాదనను తెరపైకి తెచ్చింది. సన్నీ డియోల్, రణదీప్ హుడా నటించిన 'జాట్' సినిమాలో ఒక ఐటమ్ సాంగ్ చేసిన ఊర్వశి, తాజాగా తన పేరుతో ఉత్తరాఖండ్‌లో ఒక గుడి ఉందని, ఇప్పుడు దక్షిణ భారతదేశంలో కూడా తన పేరుతో ఒక గుడిని నిర్మించాలని కోరుకుంటున్నట్లు చెప్పింది. ఉత్తరాఖండ్‌లో నా పేరుతో టెంపుల్ ఉంది. మీరు బద్రీనాథ్ టెంపుల్‌కి వెళ్లినప్పుడు, సరిగ్గా దాని పక్కనే అది మీకు కనిపిస్తుంది. ప్రజలు ఆ గుడిలో ప్రార్ధనలు చేస్తారని, ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థులు కూడా తనను ప్రార్థిస్తారని అలాగే తన ఫోటోలకు పూలమాలలు వేసి 'దండమమాయి' అని కోలుస్తారని ఊర్వశి చెప్పింది. నా కోరిక ఏమిటంటే.. గత ఒకటిన్నర సంవత్సరాల వ్యవధిలో మెగాస్టార్ చిరంజీవితో పాటు పవన్ కళ్యాణ్, బాలకృష్ణలతో కలిసి నటించాను. వారికి దక్షిణాదిలో గుళ్లు ఉన్నట్లే.. నా అభిమానుల కోసం కూడా దక్షిణ భారతంలో గుడి ఉండాలని నా కోరిక అని ఊర్వశి చెప్పుకోచ్చింది.

# అ'సామాన్యుల' జీవన చిత్రం




కథల ఎంపికలో కొత్తదనంతో పాటు వాస్తవికత, సహజత్వానికి పెద్దపీట వేస్తారు తమిళ అగ్ర హీరో ధనుష్. తన సినిమాల ద్వారా ఏదో ఒక కొత్త విషయాన్ని ప్రేక్షకులకు తెలియజెప్పాలని ప్రయత్నిస్తారు. త్వరలో ఆయన 'అమరన్' ఫేమ్ రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో ఓ సినిమా చేయబోతున్నారు. 'ధనుష్55' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ సినిమా తెరకెక్కనుంది. ప్రస్తుతం ధనుష్ హిందీలో 'తేరే ఇష్క్ మే' చిత్రంలో నటిస్తున్నారు. 'రాన్‌జనా'కు సీక్వెల్ ఇది. ఇది పూర్తయిన వెంటనే రాజ్‌కుమార్ పెరియసామి చిత్రం సెట్స్‌మీదకు వెళ్లనుంది. తాజా ఇంటర్వ్యూలో దర్శకుడు రాజ్‌కుమార్ ఈ సినిమా కథ గురించి ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. మన మధ్యే జీవిస్తూ, సమాజ గమనంలో కీలక భూమిక పోషిస్తూ ఏ మాత్రం గుర్తింపుకు నోచుకొని సాధారణ వ్యక్తుల కథ ఇదని చెప్పారు. 'వీరంతా మన రోజువారి జీవితానికి ఇంధనంలాంటి వారు. సమాజాన్ని ముందుకు నడిపిస్తారు. కానీ వారున్నారనే విషయాన్ని కూడా మనం గుర్తించం. అలాంటి వ్యక్తుల జీవితాలను ఇతివృత్తంగా తీసుకొని ఈ స్క్రిప్ట్ సిద్ధం చేశా. హృదయాన్ని కదిలించే భావోద్వేగాలతో యథార్థ జీవన చిత్రంలా తెరకెక్కించబోతున్నాం'అన్నారు.

# వీరమల్లు కోసం యాక్షన్ కొరియోగ్రఫీ

'హరిహర వీరమల్లు' సినిమా కోసం పవన్‌కల్యాణ్ ఓ పాట పాడిన విషయం తెలిసిందే. 'మాట వినాలి గురుడా మాట వినాలి..' అంటూ సాగే ఈ పాట ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాల్లో బాగా వైరల్ అవుతోంది. రీసెంట్‌గా ఈ సినిమాలోని ఓ యాక్షన్ సీక్వెన్స్‌కు పవన్‌కల్యాణ్ యాక్షన్ కొరియోగ్రఫీ కూడా చేశారట. ఈ విషయాన్ని చిత్ర దర్శకుడు జ్యోతికృష్ణ స్వయంగా తెలియజేశారు. ఈ మూవీలో ఆరు యాక్షన్ సీక్వెన్సులు ఉన్నాయని, వాటిలో కీలకమైన ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను పవన్‌కల్యాణ్ స్వయంగా రూపొందించారని ఆయన తెలిపారు. 20 నిమిషాలు సాగే ఈ యాక్షన్ ఎపిసోడ్ సినిమాకే హైలైట్ కానుందని జ్యోతికృష్ణ తెలిపారు. '1100మంది పాల్గొన్న ఈ ఎపిసోడ్ కోసం పవన్ చాలా కష్టపడ్డారు. ఇంటర్నేషనల్ కొరియోగ్రాఫర్స్‌తో డిస్కస్ చేసి ఈ ఎపిసోడ్‌ని ఆయన డిజైన్ చేశారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు స్టూడియోలో ఈ ఎపిసోడ్‌ని షూట్ చేశాం' అని జ్యోతికృష్ణ చెప్పారు. ఈ సినిమా ఫస్ట్ పార్ట్‌ని మే 9న విడుదల చేసేందుకు మేకర్స్ శతవిధాలా ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో బాబీడియోల్, నర్గీస్ ఫక్రీ, నోరా ఫతేహీ ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: జ్ఞానశేఖర్, మనోజ్ పరమహంస, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, సమర్పణ: ఎ.ఎం.రత్నం, నిర్మాత: ఎ.దయాకర్, నిర్మాణం: మెగా సూర్య ప్రొడక్షన్స్.

# 'కేసరి 2' ఇంట్రో మిస్ అవ్వకండి.. అభిమానులకు అక్షయ్ రిక్వెస్ట్

బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'కేసరి చాప్టర్ 2' (%ఖవయఙతీఱ జష్ట్రుజ్‌వతీ%2). అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ జలియన్ వాలాబాగ్ అనేది ట్యాగ్‌లైన్. మాధవన్, రెజీనా కసాండ్రా, అనన్య పాండే కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు కరణ్ సింగ్ త్యాగీ దర్శకత్వం వహిస్తుండగా.. ధర్మ ప్రొడక్షన్ బ్యానర్‌పై కరణ్ జోహార్ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. సమ్మర్ కానుకగా ఈ చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే ఈ సినిమాకు సంబంధించి అభిమానులకు ఒక రిక్వెస్ట్ చేశాడు అక్షయ్ కుమార్. ఈ సినిమా చూసేవారు ఇంట్రో మిస్ అవ్వకండంటూ తెలిపాడు. ఈ సినిమా చూడటానికి వచ్చే వారందరికీ నా విజ్ఞప్తి ఏమిటంటే.. దయచేసి 'కేసరి 2' ఇంట్రో మిస్ అవ్వకండి. ఈ సినిమాలోని మొదటి 10 నిమిషాలు చాలా ముఖ్యమైనవి. మీ కెమెరా ద్వారా ఇది ప్రతి ఒక్కరికీ చేరుతుందని నాకు నమ్మకం ఉంది. ఈ సినిమా చూడాలని నిర్ణయించుకున్నవారు ఆలస్యంగా రాకూడదని తెలుసుకోవాలి. సరైన సమయంలో రావాలి. ఈ సినిమా యొక్క కథ ఆ 10 నిమిషాలు నుంచే ప్రారంభమవుతుందంటూ అక్షయ్ చెప్పుకోచ్చాడు.



# అతనితో నాది ప్రత్యేక బంధం.. దానికి పేరు పెట్టలేమన్న సమంత

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ఇటీవల సినిమాల కన్నా కూడా ఇతర విషయాలతో ఎక్కువగా వార్తలలో నిలుస్తూ వస్తుంది. మయోసైటిస్ వలన సినిమాలు కాస్త తగ్గించిన సమంత సోషల్ మీడియాలో మాత్రం చాలా యాక్టివ్‌గా ఉంటుంది. తన పర్సనల్, ప్రొఫెషనల్ కి సంబంధించిన పలు విషయాలు పంచుకుంటూ ఉంటుంది. అలానే ఇంటర్వ్యూలలో ఆసక్తికర విషయాలు తెలియజేస్తూ ఉంటుంది. తాజాగా కోలీవుడ్‌లో జరిగిన గోల్డెన్ క్వీన్ అవార్డుల కార్యక్రమంలో ప్రముఖ నటి సమంత గోల్డెన్ క్వీన్ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె తన సినీ ప్రయాణం, వ్యక్తిగత అనుభవాల గురించి మాట్లాడింది. అలానే దర్శకుడు,నటుడు రాహుల్ రవీంద్రన్‌తో తనకి ఉన్న అనుబంధాన్ని ప్రస్తావిస్తూ, ఆయన తనకు అండగా నిలిచిన సందర్భాలను గుర్తు చేసుకున్నారు. తనకు ఆరోగ్యం బాగాలేని క్లిష్ట సమయంలో రాహుల్ రవీంద్రన్ అండగా నిలిచాడని సమంత చెప్పుకొచ్చింది. లేచిన దగ్గర నుండి సాయంత్రం వరకు రాహుల్ నాతోనే ఉంటూ జాగ్రత్తగా చూసుకున్నాడు. మా బంధానికి పేరు పెట్టలేను. స్నేహితుడా, సోదరుడా, కుటుంబ సభ్యుడా అనేది చెప్పలేను అంటూ రాహుల్‌పై తనకున్న అభిమానాన్ని వ్యక్తపరిచింది సమంత. ఇక అభిమానుల సపోర్ట్ నాకు ఎప్పుడు ఉంటుందని, అది నా అదృష్టం, హార్ట్ వర్క్, లక్ వల్లనే ఇది సాధ్యమైందని పేర్కొంది. ఇక మనం తీసుకునే ఒక్క నిర్ణయాన్ని బట్టి కెరీర్ ఎలా ఉంటుందో చెప్పలేం. తెలిసీ, తెలియక తీసుకునే ఎన్నో నిర్ణయాలు మన ప్రయాణంపై ప్రభావం చూపుతాయి అని సమంత పేర్కొంది. ఇక దర్శకురాలు సుధ కొంగర.. సమంతపై ప్రశంసలు కురిపించింది సమంత. గత ఐదేళ్లుగా ఆమెను దగ్గర నుంచి చూస్తున్నానని,ఆమె కష్టాలు చూసి కన్నీళ్లు వచ్చేవని, ఎంతోమంది అమ్మాయిలకు సమంత స్ఫూర్తి అని అన్నారు ఆమె నటించిన 'ఊ అంటావా..' పాట నాకెంతో ఇష్టం" అని సుధ కొంగర చెప్పుకొచ్చారు. ఇక అదే సమయంలో నాకు యాక్షన్ ఫిల్మ్ చేయాలనే ఆసక్తి ఉందని అనడంతో, తప్పకుండా మనం ఒక యాక్షన్ ఫిల్మ్ చేద్దాం అంటూ సుధ కొంగర హామీ ఇచ్చారు





OWNER AND PUBLISHED BY DAMA VIJAYAKUMAR, PRINTED AT VIJAY PUBLISHERS AND PRINTERS
D.No. 1-176, ANJUR Village & Post, K.V.B.PURAM Mandal, PIN:517643, Thirupati District A.P. Mobile: 9440352036